క్లుప్తంగా

సమస్యలపై అంగన్‌వాడీల వినతి

పుత్తూరు రూరల్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సీడీపీఓ కె.పద్మజకు గురువారం వినతిపత్రం అందజేశారు. జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, 300 జనాభా మించిన చోట మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

నట్టల నివారణపై అపోహలను వీడండి


గొర్రెలకు నట్టల నివారణ మందులు తాగిస్తున్న పశువైద్యాధికారి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): మేకలు, గొర్రెలల్లో నట్టల నివారణపై అపోహాలను వీడాలని పశుసంవర్థకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.ప్రభాకర్ అన్నారు. గురువారం నెల్లేపల్లి పంచాయతీ కొత్తూరులో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నట్టల నివారణ మందును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బేబీ, సర్పంచ్ రవీంద్రరెడ్డి, డీడీ డాక్టర్ అసిఫ్, ఏడీ డాక్టర్ మురళి, డాక్టర్ నాగార్జున పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

కార్వేటినగరం: బడి ఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలని, వారిని పనిలో పెట్టుకుంటే శిక్ష తప్పదని లేబర్ అసిస్టెంట్ కమిషనర్ ఓంకారరావు అన్నారు. గురువారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా కార్వేటినగరంలోని పలు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ బాల కార్మికులను పనిలో పెట్టుకున్న దుకాణ యజమానులపై కేసు నమోదు చేయడమే కాకుండా రూ.50 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ సచివాలయ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న సచివాలయ సిబ్బంది

వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణపల్లెలో బండి ఈశ్వరరెడ్డి కుటుంబ సభ్యులకు గురువారం వైస్ ఎంపీపీ బట్టే రమణసుబ్రమణ్యం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన సచివాలయ సిబ్బంది ఈశ్వరరెడ్డి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ ఆ గ్రామానికి చేరుకుని ఈశ్వరరెడ్డి మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ బీమా కింద బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట కార్యదర్శి రితేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్, మాజీ సర్పంచ్ శ్యామల ఉన్నారు.

ఘనంగా ప్రదోష కాల పూజలు


నందీశ్వరుడికి అభిషేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివునికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు చేశారు. వేకువజామునే కొండమల్లీశునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాలంకరణ చేసి, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సాయంత్రం ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

లారీ ఢీ.. స్కూటరిస్టుకు గాయాలు

ఏర్పేడు: లారీ ఢీకొని ఇద్దరు మోటార్ సైక్లిస్టులు గాయపడిన సంఘటన గురువారం మండలంలోని అంజిమేడు వద్ద చోటుచేసుకుంది. ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపిన వివరాలు.. తిరుపతికి చెందిన జయశంకర్(35), వీరాస్వామి(43) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో స్వల్పగాయాల పాలైన వారిద్దరినీ చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీమా.. పాడిరైతుకు ధీమా..

- పశువులకు ప్రమాదబీమా సౌకర్యం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న పశువైద్యాధికారులు
- 15 రోజుల్లో పరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు



బీమా చేసిన పశువుకు చెవిపోగు వేస్తున్న పశువైద్యులు, పిం.కొత్తూరులో మృతిచెందిన ఆవులు (ఫైల్)

మనుషులకే కాదు పశువులకూ ప్రమాద బీమా తప్పనిసరిగా చేయించాలి. ఏదైనా ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు సంభవించిన సమయంలో పశువులు మృతి చెందితే పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నష్టాన్ని పూడ్చేందుకు ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ఏదైనా నష్టం జరిగినప్పుడు సదరు పాడి రైతులకు ప్రభుత్వం బీమా సాయం అందించి ఆదుకుంటోంది.

నియోజకవర్గంలో పశువుల వివరాలు ఇలా

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
నగరి	12200	1500	10000	15000
పుత్తూరు	9700	1200	8000	12000
విజయపురం	4200	700	3000	6000
నింద్ర	3700	600	2700	4500
వడమాలపేట	2400	300	2000	3000

నగరి: నామమాత్రపు ప్రీమియం చెల్లించడం ద్వారా ప్రభుత్వం మూడేళ్ల పాటు పశువులకు బీమా సదుపాయం కల్పిస్తోంది. ఈ బీమా చేయిస్తే ప్రమాదవశాత్తు పాడి పశువు, గొర్రెలు, మేకలు ఇతర పశువులు చనిపోయినప్పుడు వాటి పెంపకందారులు పరిహారం పొందే అవకాశం ఉంటుంది. గతంలో వైఎస్సార్ పశు నష్ట పరిహారం పథకం ఉండేది. అందులో పశువు విలువ ఎంత ఉన్నా గరిష్టంగా పాడి పశువుకు రూ.30 వేలు, గొర్రె, మేకలకు రూ.6 వేలు చొప్పున అందించే వారు. ఒక్కో రైతుకు ఐదు పాడి పశువుల వరకు, గొర్రెలు, మేకలకు ఇరవై వరకు గరిష్టంగా అందించేవారు. ఇప్పుడు ఈ పథకం స్థానంలో వైఎస్సార్ బీమా పథకం తీసుకొచ్చారు. పశువుల విలువను బట్టి బీమా చెల్లిస్తారు.

బీమాలో ప్రభుత్వ వాటా

బీమా పథకంలో పశువు విలువ ఎంత ఉంటుందో అంతటికీ బీమా చెల్లించే వెసులుబాటు ఉంటుంది. ఉదాహరణకు పాడి పశువు విలువ రూ.1.50 లక్షలు ఉంటే అంత మొత్తాన్ని బీమా చెల్లించుకోవచ్చు. బీమాకి చెల్లించే ప్రీమియం మొత్తంలో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని మినహాయించి రైతులు మిగిలిన సొమ్ము చెల్లించాలి. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఈ పథకం ప్రారంభం అయింది. ఈ పథకం ద్వారా పశువులు, గొర్రెలు, మేకలు చనిపోతే పదిహేను రోజుల్లో బీమా మొత్తం పొందే అవకాశం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీలతో పాటు దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న పశుపెంపకందారులు ప్రీమియంలో ఇరవై శాతం వాటా చెల్లించాలి. చెరో 40 శాతం చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న వారు 50 శాతం వాటా చెల్లించాలి. 25 శాతం చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరో 50 శాతం ప్రీమియాన్ని చెల్లిస్తాయి. ప్రతి కుటుంబానికి ఐదు పాడి పశువులు, 50 గొర్రెలు, మేకలు, పందులకు పశు బీమా ద్వారా పరిహారం పొందే అవకాశం ఉంది.

లబ్ధిదారులు చెల్లింపు ..

- వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.30 వేలు ఖరీదైన గేదె, ఆవుకు మొత్తం ప్రీమియం మూడేళ్ల 6.4శాతం అంటే రూ.1920గా నిర్ధారించారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.384, ఏపీఎల్ కేటగిరి వారు రూ.960 చొప్పున లబ్ధిదారుల వాటాగా చెల్లించాలి.
- రూ.15 వేలు ఖరీదు చేసే గేదె, ఆవుకు మూడేళ్లకు 6.4 శాతం అంటే రూ.960గా ప్రీమియం నిర్ణయించారు. దీనిలో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు సబ్సిడీ పోనూ రూ.192, ఏపీఎల్ వారైతే రూ.480 చెల్లించాలి.
- రూ.6 వేలు విలువైన గొర్రె, మేక, పందులకు మొత్తం సంవత్సరానికి మూడు శాతం చొప్పున రూ.180, రెండేళ్లకు రూ.270, మూడేళ్లకు రూ.375 చొప్పున ప్రీమియం చెల్లించాలి. ఇందులో ఒకటి నుంచి మూడేళ్ల ప్రీమియం కింద ఎస్టీ, ఎస్సీ, బీపీఎల్ లబ్ధిదారుడు రూ.36, రూ.54, రూ.75 చొప్పున, ఏపీఎల్ వారు రూ.90, రూ.135, రూ.187.50 చొప్పున లబ్ధిదారుడి వాటా చెల్లించాల్సి ఉంటుంది. ఆవు విలువను బట్టి, నాటు ఆవు, క్రాస్‌బ్రీడ్ ఆవు తదితర రకాలను బట్టి ప్రీమియంలో మార్పు ఉంటుంది.

బీమా చేయాల్సిన విధానం..

- అర్హత కలిగిన పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారులు బీమా చెల్లించేందుకు సమీపంలో ఉండే రైతు భరోసా కేంద్రాలు, పశు వైద్యశాలలో గానీ సంప్రదించాలి.
- సదరు రైతు/పెంపకందారుడు ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి.
- నామినీ వివరాలు, పేరు, రిలేషన్, నామినీ పుట్టిన తేదీ కరెక్టుగా నింపాలి.
- వైఎస్సార్ పశు బీమా చేసిన ప్రతి పశువుకు చెవిపోగు (ఇయర్ ట్యాగ్) తప్పనిసరి చేయించాలి. ట్యాగ్ లేకపోతే బీమా సదుపాయం పొందే అవకాశం కోల్పోతారు.
- బీమా మూడేళ్లకు చేసినా, పశువుకు ట్యాగ్ మిస్ అయితే మళ్లీ వేయించుకోవాలి.
- ప్రతి పశువుకు బీమా చేసి ఆన్‌లైన్ చేయించేందుకు రూ.50, మేక, గొర్రె, ఇతర జంతువులైతే రూ.5 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

పదిహేను రోజుల్లోనే పరిహారం


వైఎస్సార్ పశు బీమా పథకంలో చేరితే పశువు చనిపోయిన పదిహేను రోజుల్లోనే పరిహారం పొందవచ్చు. ఈ నెల 1వ తేదీ నుంచి బీమా ప్రీమియం ప్రారంభమైంది. పశువు విలువ ఎంత ఉంటే అంత విలువకూ బీమా సదుపాయం వర్తించే అవకాశం ఉంటుంది. బీమా ప్రీమియం చెల్లింపులో ప్రభుత్వ సబ్సిడీ పోను మిగిలిన సొమ్ము రైతు, పెంపకందారుడు చెల్లించాలి. పాలిచ్చే పశువుని బట్టి దాని విలువను పశువైద్యాధికారులు నిర్ధారిస్తారు.

– వాసు, పశు సంవర్థక శాఖ ఏడీ, నగరి

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం


వెదురుకుప్పంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

వెదురుకుప్పం: డ్రగ్స్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద అన్నారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా గురువారం మండలంలోని చవటగుంటలో డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఆమె మాట్లాడుతూ డ్రగ్స్ రహిత రాష్ట్రాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా యువత మత్తుకు అలవాటు పడి జీవితాలను పాడు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. డ్రగ్స్ వాడకంతో అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుని జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. పురుషులతో పాటు మహిళలు కూడా మత్తుపదార్థాలకు బానిసలవుతున్న సందర్భాలున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే మత్తు వాడకాన్ని వ్యతిరేకించాలన్నారు. చదువు మీద ధ్యాస ఉంచితే విద్యార్థులు చెడు అలవాట్లకు లోనవరని చెప్పారు. మత్తుతో బతుకులు చిత్తవుతున్నట్లు తెలిపారు. వ్యసనాలతో బంగారు భవిష్యత్తును ఛిద్రం చేసుకోవద్దని సూచించారు. ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, డ్రగ్స్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కిట్లు విద్యార్థులకు వరం


కిట్లు అందజేస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం: జగనన్న కిట్లు విద్యార్థులకు ఓ వరం అని జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆరిమాకులపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను ఆయన ఎంపీడీఓ కష్ణయ్యతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రూ.2,400 విలువ జేసే కిట్లను ప్రభుత్వం ప్రతి విద్యార్థికీ ఉచితంగా అందజేస్తున్నదన్నారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మారిపోయాయన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి పాఠశాలలో ఇంగ్లిషు మీడియంతో పాటు సీబీఎస్ఈ సిలబస్‌తో కూడిన విద్య అందించనున్నారని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు.

జన సంక్షేమమే జగనన్న లక్ష్యం


టీపీఎస్ఆర్ పురంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: 'జన సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యం. అందులో భాగంగానే ఆయన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో సువర్ణపాలన నడుస్తోంది. ఫలితంగా రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు.' అని డిప్యూటీ సీఎం, ఎక్సైజ్‌శాఖ మంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం నరసింహపురం సచివాలయం పరిధిలోని టీపీఎస్ ఆర్ పురం, నరసింహపురం, కోదండరామాపురం, మిద్దినత్తం, టీపీఎస్ఆర్ పురం ఆదిఆంధ్రవాడ, పోతురాజుగుంట, బలిజపూరు, అలిపులగుంట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఎం నారాయణస్వామికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌లు అందజేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. గడప గడపలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున మంజూరు చేస్తుందన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించడంతో పాటు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. పల్లె ముంగిట సేవలు అందించడమే ప్రభుత్వం లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. దీంతో ఆయన జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోనున్నారని తెలిపారు. పేద, బడుగు బలహీనవర్గాలకు అండగా ఉంటూ రైతన్నలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్న పేదల పక్షపాత ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని తెలిపారు. గత ప్రభుత్వం ఏం మేలు చేసిందని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని స్థాయిలో పథకాల ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, పార్టీ మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, ఆర్బీకే చైర్మన్ పోలయ్య, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్, తహసీల్దార్ బాలు, ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్, ట్రాన్స్‌కో ఏడీ జ్ఞానేశ్వర్, ఏపీఓ హౌసింగ్ ఏఈ దాము, ఏఓ ఢిల్లీప్రసాద్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, నాయకులు రవిరెడ్డి, చిన్నపయ్యన్, తిరుమల, పయణి, లక్ష్మీపతి, గోవిందస్వామి, బాబు, గోపాల్, వాసురాజు తదితరులు పాల్గొన్నారు. కాగా డిప్యూటీ సీఎం గడప గడపకు కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లిన సందర్భంగా సంక్షేమ పథకాలతో ఆనందంగా ఉన్నామని చెప్పారు. ఆ సంతోషం వారి మాటల్లోనే..

జగనన్న మాకు దేవుడు


నా భర్త కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నాడు. గత ప్రభుత్వంలో నా భర్తకు పింఛన్ రూ. 3 వేలు మాత్రమే ఇచ్చేవారు. వారానికి మూడు సార్లు డయాలిసిస్ చేసుకోవడానికి అదనంగా రూ.ఐదారు వేలు అయ్యేది. పాదయాత్రలో మాలాంటి వారి బాధలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే కిడ్నీ వ్యాధి బాధితులకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వడంతో ఇబ్బందులు తప్పాయి. జగనన్న మా పాలిట దేవుడు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

–రమణ, గృహిణి, టీపీఎస్ఆర్ పురం

ఆర్థికంగా ఎదిగాను


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత మా కుటుంబం ఆర్థికంగా ఎంతో వృద్ధి చెందింది. మా కుటుంబానికి వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, జగనన్న చేదోడు, జగనన్న అమ్మ ఒడి తదితర పథకాలు వచ్చాయి. పథకాల నగదు అవినీతికి చోటు లేకుండా పారదర్శకంగా మా బ్యాంకు ఖాతాల్లోనే జమ అయ్యింది. ఆ నగదుతో రెండు పాడి పశువులు కొనుగోలు చేశాం. పాడి ఆవులు ఇచ్చే పాలను విక్రయించుకుని సుఖంగా ఉన్నాము.

–అమ్ములు, గృహిణి, నరసింహపురం

ఇన్ని పథకాలు ఎవరూ ఇవ్వలేదు


సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత అమలు చేసినన్ని సంక్షేమ పథకాలు గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వలేదు. మహిళలకు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ రుణాలు, చిరు వ్యాపారులకు జగన్న చేదోడు, ఉన్నతి, స్త్రీనిధి పథకాలు ఇస్తున్నారు. ఇవేకాకుండా విద్యార్థులకు ఉచితంగా విద్యా సామగ్రి, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలు ఎన్నడూ చూడ లేదు. మళ్లీ ఆయన సీఎం కావాలి.

–సులోచన, గృహిణి, నరసింహపురం

అత్యున్నత విద్యా ప్రమాణాలే ప్రభుత్వ ధ్యేయం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆర్కే సెల్వమణి

పుత్తూరు రూరల్: అత్యున్నత విద్యా ప్రమాణాలే ధ్యేయంగా నేటి జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని దక్షిణ భారత సినీ కార్మికుల సమాఖ్య (ఫెప్సీ) అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నేత ఆర్కే సెల్వమణి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆణిముత్యాలు పేరిట 2022–23లో నగరి నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సెల్వమణి మాట్లాడుతూ విద్యార్థులంటే ఎంతో ఇష్టపడే మంత్రి రోజమ్మ అనారోగ్యంతో రాలేకపోయారని తెలిపారు. ఆమె చేతుల మీదుగా విద్యార్థులకు సత్కారం చేయలేక పోయినా, ఆశీస్సులను తన ద్వారా పంపించిందని చెప్పారు. దీంతో ఒక్కసారిగా థ్యాంక్యూ రోజా మ్యామ్ అంటూ పాఠశాల ప్రాంగణం చప్పట్లతో మార్మోగిపోయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటు హక్కులేని విద్యార్థుల కోసం వేల కోట్లు ఖర్చు చేయడం పట్ల విద్యారంగంపై ఆయనకున్న ఉన్నత భావాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. గతంలో ఇక్కడి విద్యార్థులు చదువుల కోసం అమెరికా వెళ్లేవారని, నేటి జగనన్న ప్రభుత్వంలో అమెరికా ఉపాధ్యాయులు మన విద్యార్థులకు బోధించడానికి ఇక్కడికి వస్తున్నారని చెప్పారు.

జగనన్న ఆణిముత్యాలు వీరే!

నగరి నియోజకవర్గ స్థాయిలో పదో తరగతిలో ప్రథమ ర్యాంకు సాధించిన వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం హైస్కూల్ విద్యార్థిని చాందినికి రూ.15 వేలు, ద్వితీయ స్థానం సాధించిన పుత్తూరు మండలం రాచపాళెం హైస్కూల్‌కు చెందిన మయూరికి రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన నింద్ర మండలం కొత్తూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఝాన్సీకి రూ.5 వేలు చొప్పున అందించి మెడల్, సర్టిఫికెట్స్‌తో సెల్వమణి చేతుల మీదుగా సత్కరించారు.

ఇంటర్మీడియెట్‌లో గ్రూప్ వైజ్ ఫస్ట్ ర్యాంకులు సాధించిన నగరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన జ్ఞానపూర్ణిమ, సంధ్య, పుత్తూరు ఏపీ రెసిడెన్షియల్ కాలేజీకి చెందిన తనుజ, ప్రవంతికి రూ.15 వేలు చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ శేఖర్, డీవైఈఓ రఘురామయ్య, ఎంఈఓలు తిరుమలరాజు, శ్రీదేవి, ఆంజనేయులు, నారాయణ, పద్మావతి మంత్రి రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు హరి, నీలమేఘం, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఎంపీపీలు మునివేలు, భార్గవి, దీప, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం


కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టు మెయిన్ రోడ్డులో రెండు దశాబ్దాలుగా ఉన్న మురుగునీటి సమస్యకు మంత్రి చొరవతో పరిష్కారం లభించింది. కీళపట్టు ప్రధాన మార్గంలో మురుగునీరు వెళ్లేందుకు సరైన మార్గం లేక స్తంభించిపోతూ వర్షాకాలంలో రోడ్డుపైకి ప్రవహించేది. సుదీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్యను స్థానికులు మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆమె సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపారు. సాధారణ నిధుల ద్వారా రూ.8 లక్షలు మంజూరు కావడంతో ప్రధాన రహదారిలో కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కారణంగా ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలు ఆపేశారు. గురువారం నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి పరిశీలించారు. 20 రోజుల్లోపు కాలువ నిర్మాణం, కల్వర్టు, రోడ్డు పనులు పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరిస్తామని తెలిపారు. డీఈ నరేష్ ఉన్నారు.

వృద్ధులకు అన్నదానం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు గురువారం దాతలు అన్నదానం చేశారు. స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. మండలంలోని జీలావారికండ్రిగ గ్రామానికి చెందిన నందిబోయన హనుమంతయాదవ్, భారతి దంపతుల వివాహ వార్షికోత్సం సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. దాత మాట్లాడుతూ ఏటా తన వివాహ వార్షికోత్సవానికి వృద్ధులు, వికలాంగులకు అన్నదానం, పండ్లు, స్వీట్లు పంచే సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం రాస్ వృద్ధాశ్రమ అభివృద్ధికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసుబ్రమణ్యం, మునిలక్ష్మి, వెంకటేష్‌శెట్టి, శ్రీనివాసులుయాదవ్, రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): విద్యారంగ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. గురువారం గంగాధర నెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూతన్నంగా నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకీకరించి మెరుగైన వసతులు కల్పించి అన్ని విధాలా తీర్చిదిద్దినట్లు చెప్పారు. అనంతరం టెన్త్, ఇంటర్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. గంగాధరనెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు వైస్ ఎంపీపీ హరిబాబు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ విజయేంద్రరావు, ఎంపీపీ అనిత, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్, ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్, సర్పంచ్ సుబ్రమణ్యం యాదవ్, వైఎస్సార్ సీపీ నేతలు గుణశేఖర్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, మునిరాజారెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

కార్వేటినగరం: ఆలయాల అభివృద్ధి సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. సుబ్రమణ్యస్వామి ఆలయ చైర్మన్ కేశవరెడ్డి, పార్టీ నాయకులతో కలసి డిప్యూటీ సీఎం నారాయణస్వామి శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తుడా ప్లానింగ్ విశ్రాంత అధికారి కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, డాక్టర్ దానవేంద్రరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటరత్నం, సచివాలయ మండల కన్వీనర్ పురంధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు దొరబాబు, చందురాజు,పద్మనాభశెట్టి పాల్గొన్నారు.

'స్మార్ట్ టికెట్' విధానంలో నిర్లక్ష్యమేల?

చిత్తూరు రూరల్: స్మార్ట్ టికెట్ విధానంలో నిర్లక్ష్యం ఎందుకని డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని ఓ ప్రయాణికుడు గురువారం యూటీఎస్ (యూనిఫైడ్ టికెట్ సొల్యూషన్) విధానం అమలు చేయడం లేదని బస్టాండులోని డీపీటీఓను ఆయన కార్యాలయంలో కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీనిపై ఆయన స్పందించి అధికారులతో మాట్లాడారు. విధిగా నిర్ణీత బస్సుల్లో యూటీఎస్ విధానం అమలు చేయాలన్నారు. ఆ విధానంలో టికెట్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, జీ పే, ఫోన్ పే ద్వారా నగదు చెల్లిస్తే టికెట్లు ఇవ్వాలన్నారు. మళ్లీ ఇలాంటి ఫిర్యాదులు రాకూడదని ఆయన హెచ్చరించారు.

సామూహిక గృహప్రవేశాలకు ఇళ్లను సిద్ధం చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌మురళి

కార్వేటినగరం: పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేసి జూలైలో జరిగే సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఎంపీడీఓ మోహన్‌మురళి తెలిపారు. గురువారం కొటార్వేడు సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి నివాసాలు తప్పనిసరని గుర్తించి, నివేశ స్థలాలతో పాటు, గృహ నిర్మాణాలను చేపడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, గృహనిర్మాణాలను పూర్తి చేసుకోనేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. పునాదులు, గోడ మట్టం, పునాదుల స్థాయిలో నిలిచి పోయిన ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి, జూలై 31వ తేదీ లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. లేకపోతే ఇళ్లు నిర్మించని వారి ఇంటి పట్టాలను రద్దు చేస్తామని తెలిపారు. సిబ్బంది లబ్ధిదారులకు ఈ విషయంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలారాణి, ఈఓపీఆర్డీ లక్ష్మీపతి, కార్యదర్శి వాణి తదితరులు పాల్గొన్నారు.